www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 15 నవంబర్ 2023
5
ఏలూరు



రాచన్నగూడెంలో మహిళ దారుణ హత్య

జీలుగుమిల్లి:మండలంలోని రాచన్నగూడెంలో దారుణం జరిగింది. గ్రామానికి చెందిన ఓ మహిళను అతిదారుణంగా కొట్టి ఆపై హత్యచేసి చెరువుగట్టుపై పడేశారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాచన్నగూడేనికి చెందిన కన్నోజు అనసూయ(70)కు భర్త, ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలున్నారు. ఇటీవల కుటుంబంలో ఆర్థిక కలహాలు తలెత్తడంతో గత కొంతకాలంగా అనసూయ చిన్న కుమారుడు శ్రీను వద్దే ఉంటుంది. ఈ తరుణంలో చెరువు గట్టు వద్ద అనుమానాస్పద స్థితిలో ఆమె మృతిచెందింది. మంగళవారం తెల్లవారుజామున అటువైపు వెళ్లిన స్థానికులు గుర్తించి పోలీసులకు, బంధువులకు సమాచారం అందించారు. వెంటనే సిఐ వెంకటేశ్వరావు, ఎస్ఐ చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్ట్‌మార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. హత్యకు గల కారణాల కోసం వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను అతిత్వరలో పట్టుకుంటామని సిఐ వెంకటేశ్వరావు తెలిపారు.

దాళ్వాకు సమృద్ధిగా నీరు

ఉమ్మడి గోదావరి జిల్లాల సాగుకు 91.35 టిఎంసిల నీరు అవసరం

అందుబాటులో ఉన్నది 82.49 టిఎంసిల నీరే

వంతులు, నీటిని ఎత్తిపోసే విధానాల్లో సాగునీరు అందజేత

మార్చి నెలాఖరుకు కాలువల మూసివేత

గుర్రపుడెక్క, తూడు తొలగించి శివారు భూములకు సాగునీరు అందించేలా ఆదేశాలు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్

కరువు మండలాలపై తీర్మానానికి సమావేశం విముఖత

కీలకమైన సాగునీటి సమావేశానికి ఐదుగురు ఎంఎల్‌ఎలు డుమ్మా





ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని దాళ్వా ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సమృద్ధిగా సాగునీరు అందించనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖా మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్ స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన జిల్లా నీటిపారుదల సలహా మండలి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సంయుక్త సమావేశంలో దాళ్వా సాగుకు నీటి లభ్యత, పంటల ప్రణాళికపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా జిల్లాలో అందుబాటులో ఉన్న నీటిని దాళ్వా సాగుకు పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు పటిష్టమైన నిర్వహణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. నెలాఖరుకల్లా నారుమళ్లు వేసుకునేలా రైతులను సమాయత్తం చేయాలని, రైతుభరోసా కేంద్రాల స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నీటి లీకేజీలను అరికట్టడం, షట్టర్లు మరమ్మతులు చేయించడం, చెరువులు, కాల్వల్లో తూడు, గుర్రపుడెక్క తొలగించి శివారు భూములకు సైతం పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు తెలిపారు. ఏలూరు జిల్లాలో 56,190 ఎకరాల్లో దాళ్వా సాగు చేస్తారని అంచనా వేస్తున్నామని, దీనికి తగిన విధంగా రైతులు ఈ నెలాఖరులోగా నారుమళ్లు వేసుకునేలా చూడాలని, అవసరమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని అన్నారు. జిల్లాలోని మెట్ట ప్రాంతంలో వరిసాగుకు ప్రత్యామ్నాయంగా అపరాలు, తృణధాన్యాలు పండించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. దాళ్వాసాగుకు సంబంధించి గోదావరి డెల్టా పరిధిలోని విభజిత ఐదు జిల్లాలకు నీటి సరఫరా నిమిత్తం (తాగునీటితో కలిపి) 91.35 టిఎంసిల నీరు అవసరమన్నారు. సాగునీటి కోసం సీలేరు నుండి 40 టిఎంసిలు, గోదావరి జలాల ద్వారా 30 టిఎంసిలు, పోలవరం ప్రాజెక్టులో నీటినిల్వలు 12 టిఎంసిలు మొత్తం 82.49 టిఎంసిలు నీరు అందుబాటులో ఉందన్నారు. ఖరీఫ్‌లో పండిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని మంత్రి చెప్పారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ శివారు ప్రాంత రైతులకు సాగునీరు పూర్తిగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని, కాల్వల్లో తూడు , గుర్రపుడెక్క తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మార్చి నెలాఖరుకు కాలువల మూసివేతకు సమావేశం నిర్ణయం తీసుకుంది. ఎర్రకాలువ ప్రాజెక్టు కింద 10,017 ఎకరాలు, జల్లేరు ప్రాజెక్టు కింద 3,400 ఎకరాలకు దాళ్వాలో సాగునీరు అందించాలని సమావేశంలో నిర్ణయించారు.

నెలాఖరుకు నారుమడుల పూర్తికి చర్యలు: కలెక్టర్

జిల్లాలో రబీ సాగుకు కావాల్సిన నీరు అందుబాటులో ఉందని, ఎటువంటి ఇబ్బంది లేదని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. మండల, ఆర్‌బికె స్థాయిల్లో కూడా వ్యవసాయ సలహా మండలి సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు అన్నివిధాలా అండగా ఉంటున్నామన్నారు. జిల్లాలో ఇ-క్రాప్ నమోదు చేయించి, రైతులందరిని ఇకెవైసి చేయించుచున్నామన్నారు. పంట నష్టపోయిన రైతులకు నిబంధనల మేరకు పంటల బీమా లేదా పెట్టుబడి రాయితీ అందిస్తున్నామన్నారు. జిల్లాలో రబీకి సాగు, తాగునీటికి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాల్వల్లో నీరు సాగుకు, తాగుకు, పశువులకు వినియోగించే అవకాశం ఉన్నందున తూడు, గుర్రపుడెక్క తొలగింపులో రసాయనాలు, క్రిమి సంహారక మందులు వినియోగించకుండా యంత్రాల ద్వారా తొలగించాలన్నారు. మెట్ట ప్రాంతంలో ఎక్కడైనా పంట నష్టం జరిగినా నిబంధనల మేరకు పంటల బీమా కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షాభావ ప్రాంతాల్లో అపరాలు, తృణధాన్యాల వరికి బదులు ప్రత్యామ్నాయంగా పండించేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. పోలవరం బేసిన్‌లో నీరు నిల్వచేసి దానిని రబీ సాగుకు వినియోగించుకునేలా సమావేశం తీర్మానం చేసిందన్నారు.

తూడు, గుర్రపుడెక్క తొలగించి శివారు భూములకు నీరివ్వాలి

ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు

కొల్లేరు ప్రాంతంలో శివారు ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని, తూడు, గుర్రపుడెక్క నిర్మూలనకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌సి జయమంగళ వెంకట రమణ కోరారు. డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించాలన్నారు. కృష్ణా బోర్డుతో మాట్లాడి సాగర్ నుండి వచ్చే నీరు వినియోగించుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మరో ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ సక్రమమైన నిర్వహణతో రబీలో సాగునీరు అందించాలన్నారు. ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసు (వాసుబాబు) మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గంలోని నిడమర్రు, గణపవరం మండలాల్లో వెంకయ్యవయ్యేరు కాలవలో తూడు, గుర్రపుడెక్క తొలగించి శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలని కోరారు. దీనిపై ఇరిగేషన్ ఎఇలు, డిఇలు దృష్టి పెట్టాలన్నారు. చింతలపూడి ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా మాట్లాడుతూ ఎ.పోలవరంలో 110 ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువు కొంతమేర ఆక్రమణలకు గురైందని, వాటిని తొలగించడంతోపాటు పూడిక తీసి చెరువును పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, జిల్లా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు ఆళ్ల సతీష్ చౌదరి, ఇరిగేషన్ ఎస్ఇ వై.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై.రామకృష్ణ, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ సాల్మన్‌రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఎస్‌విడి.సత్యనారాయణ, ఉద్యాన శాఖ డిడి రామ్మోహన్, నాబార్డు డిడిఎం నవకాంత్, ఎల్‌డిఎం నీలాద్రి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ మంజుభార్గవి పాల్గొన్నారు.

కరువు మండలాలపై తీర్మానం చేయండి

షేక్ సాబ్జీ, పిడిఎఫ్ ఎంఎల్‌సి

ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పలు మండలాల్లో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, పంటలు దెబ్బతిన్న మండలాలను కరువు మండలాలుగా ప్రకటించేలా సమావేశంలో తీర్మానం చేయాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ కోరారు. అయితే దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు విముఖత వ్యక్తం చేశారు. అక్టోబర్‌లో ఏర్పడిన వర్షాభావ పరిస్థితి కారణంగా పంటలు దెబ్బతిన్నాయని, కాబట్టి కరువు మండలాల ప్రకటనకు నిబంధనలు వర్తించవని చెప్పారు. దీనిపై సిఎంకు నేరుగా వినతి ఇవ్వాలని ఎంఎల్‌సి సాబ్జీకి సూచించారు. దెబ్బతిన్న పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ వస్తుందని, ఆర్‌బికెల ద్వారా సమగ్ర పంటలకు నష్టపరిహారం అందుతుందని సమావేశంలో తెలిపారు. గోదావరి ఆయకట్టులో శివారు భూములకు సాగునీరు అందించాలంటే కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు తొలగించేవిధంగా ప్రణాళికలు అమలు చేయాలని సాబ్జీ కోరారు.

కీలక సమావేశాలకు ఎంఎల్‌ఎలు డుమ్మా

ప్రజా సమస్యలపై జిల్లాస్థాయిలో జరుగుతున్న కీలక సమావేశాలకు పలువురు ఎంఎల్‌ఎలు డుమ్మా కొడుతున్నారు. మంగళవారం జరిగిన జిల్లా సాగునీటి సలహామండలి సమావేశానికి ఏలూరు జిల్లాలో ఏడుగురు ఎంఎల్‌ఎలకుగాను ఉంగుటూరు, చింతలపూడి ఎంఎల్‌ఎలు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఐదుగురు ఎంఎల్‌ఎలు రాలేదు. జిల్లా పరిషత్ సమావేశాలకు సైతం ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి.



ఏలూరులో యాత్రకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఏలూరుకు మోటార్ సైకిల్ 'ఉక్కు' ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని కోరుతూ సిపిఎం ప్రజా రక్షణ బేరి యాత్రలో భాగంగా చేపట్టిన మోటార్ సైకిల్ ర్యాలీ మంగళవారం రాత్రి ఏలూరు నగరానికి చేరుకుంది. విశాఖపట్నంలో ఉదయం బయలుదేరిన మోటార్ సైకిల్ యాత్రకు ఏలూరులో సిపిఎం కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, నాయకులు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ 32 మంది ఆంధ్రుల ప్రాణ త్యాగాలతో ఏర్పడిన స్టీల్ ప్లాంటును మోడీ ప్రభుత్వం దుర్మార్గంగా ప్రయివేటుపరం చేసేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా వైసిపి ప్రభుత్వం పోరాడకుండా ప్రజలకు ద్రోహం చేస్తుందని విమర్శించారు. టిడిపి, జనసేనలు సైతం స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కృషి చేయకుండా మోడీకి వంత పాడుతున్నాయని విమర్శించారు. వేలాది మంది కార్మికులు పనిచేస్తున్న విశాఖ ఉక్కును కాపాడేందుకు సిపిఎం కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం 15వ తేదీన జరగనున్న ప్రజారక్షణ భేరి బహిరంగ సభలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సిపిఎం నాయకులు డిఎన్‌విడి.ప్రసాద్, బి.సోమయ్య, కె.శ్రీనివాస్, జి.నరసింహారావు, వి.సాయిబాబు, కె.విజయలక్ష్మి, బి.జగన్నాధరావు, పివి.రామకృష్ణ, గోపి, ఎస్ఎన్.రమేష్, ఇస్సాక్ నాయకత్వం వహించారు.

సిఎంఒ ఆదేశాలతోనే సాగునీటి సలహా మండలి సమావేశం : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఈనెల ఎనిమిదో తేదీన విజయవాడలో జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయం ఇచ్చిన ఆదేశాల మేరకే ఈ నెల 14న జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం, వ్యవసాయ సలహా మండలి సంయుక్త సమావేశం నిర్వహించామని జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ తెలిపారు. ఈ సమావేశంపై కృష్ణా జిల్లా కలెక్టర్‌కు రాతపూర్వకంగా తెలిపారన్నారు. 14వ తేదీన జరిగే కృష్ణా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి జిల్లా నుంచి ఏ అధికారులు హాజరవుతారో? ఎవరు హాజరుకారో? ముందస్తుగా చెప్పామన్నారు. కృష్ణా జిల్లా పరిషత్ ఛైర్మన్, కైకలూరు, నూజివీడు ఎంఎల్‌ఎలకు ఫోన్‌ద్వారా తెలిపామన్నారు. జిల్లా నుంచి ఐదుగురు అధికారులు మినహా జాయింట్ కలెక్టర్, నూజివీడు సబ్ కలెక్టర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్‌తో పాటు మిగిలిన అధికారులు హాజరయ్యారన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో జరిగిన సాగునీటి సలహా మండలి సమావేశంలో తాగు, సాగునీటికి సంబంధించి సమస్యలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు.



సిఎం సభా ప్రాంగణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

17న సిఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడులో ఈనెల 17న సిఎం జగన్ పర్యటనకు సంబంధించి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతితో కలిసి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. పర్యటనను విజయవంతం చేసేందుకు ఎవరికి నిర్దేశించిన విధులను వారు సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మైలవరం రోడ్డు, పెట్రోల్ బంకు సమీపంలోని ఖాళీ స్థలంలో హెలీప్యాడ్, అన్నవరం రహదారిలోని ఎంఐజి లే అవుట్‌లో సభావేదిక ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. హెలీప్యాడ్ వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. పార్కింగ్‌కు నిర్దేశించిన స్థలాల నుంచి సభా ప్రాంగణానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా సిఎం కాన్వాయ్, ఇతర బారికేడ్ పనులు, స్టాల్స్ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలకు సంబంధించి లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చే ఈ కార్యక్రమంలో సిఎం పాల్గొంటారని తెలిపారు. దానికి అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్, తహశీల్దారు ఎల్లారావు, అధికారులు ఉన్నారు.

సహకార రుణాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజలకు సహకార కేంద్ర బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల రుణసౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పిఎసిఎస్ ఛైర్‌పర్సన్ బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్ తెలిపారు. స్థానిక పిఎసిఎస్ కార్యాలయం వద్ద మంగళవారం నాబార్డ్ సౌజన్యంతో నిర్వహిస్తున్న డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సహకార కేంద్ర బ్యాంకులో పొదుపు ఖాతా తెరవాలని, దీనివల్ల ఎన్నో లాభాలు పొందొచ్చన్నారు. పిఎం జెజెబివై, పిఎంఎస్‌బివై, ఎపివై, కిసాన్ క్రెడిట్ కార్డు, నగదు రహిత లావాదేవీలు, ఎటిఎం రూపే డెబిట్ కార్డు వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను కళాజాతా బృందం వారు ప్రజలకు అవగాహన కల్పించారు. కళాజాత ప్రదర్శనలు గ్రామస్తులను, రైతులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం తక్షణం కొనుగోలు చేయాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - దెందులూరు


బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో రైతుల నుండి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పోతునూరు కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని రైతుసంఘం నాయకులు పరిశీలించారు. ధాన్యం కొనుగోలులో సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు చేసి ఆదుకోవాలంటూ రైతులు నినాదాలు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వాతావరణ మార్పులతో రైతులు ఆందోళన పడుతున్నారని చెప్పారు. ఆరుదలకు వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఇంకా గోనె సంచులు ఇవ్వడం లేదన్నారు. వాయుగుండం నేపథ్యంలో కొనుగోలు నిబంధనలతో రైతులను ఇబ్బంది పెట్టకుండా కల్లాల్లో ఉన్న ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సామూహిక కల్లాలు లేక రోడ్లపైనే ధాన్యం ఆరబెట్టుకోవాల్సి వస్తోందన్నారు. టార్పాలిన్లు సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో యూరియా సంచులతో కుట్టిన బరకాలనే వాడుతున్నారని చెప్పారు. 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లు రైతులకు వెంటనే అందించాలని కోరారు. రైతుల నుండి ధాన్యం వెంటనే కొనుగోలు చేయకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు గండి రాజా, మండల కార్యదర్శి సున్నా వెంకట్రావు, చల్లా బాలస్వామి పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

సీటు ఎవరికిచ్చినా పరస్పర సహకారం

ఉంగుటూరు నియోజకవర్గ టిడిపి, జనసేన సమావేశంలో నేతలు

ప్రజాశక్తి - భీమడోలు

రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు టిడిపి, జనసేన పార్టీలు సంయుక్తంగా పోరాడాలని ఆయా పార్టీల ఉంగుటూరు నియోజక వర్గ నేతలు కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఉంగుటూరు నియోజకవర్గస్థాయి టిడిపి, జనసేన పార్టీల సంయుక్త కార్యాచరణ సమన్వయ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ సమన్వయ కర్త పి.ధర్మరాజు హాజరయ్యారు. ఈ సమావేశంలో రానున్న ఎన్నికల్లో జనసేన, టిడిపి కలిసి పోరాడాలని కోరారు. పొత్తులో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గం సీటు ఏ పార్టీకి కేటాయించినప్పటికీ ఒకరికొకరు సహకరించుకోవాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన టిడిపి, జనసేన ముఖ్య కార్యకర్తలు హాజరయ్యారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ ఎలిజా

వైభవంగా మద్ది కార్తీక మాసోత్సవాలు ప్రారంభం

జంగారెడ్డిగూడెం:మండలంలోని గుర్వాయగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీకమాసోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చింతలపూడి ఎంఎల్‌ఎ విఆర్.ఎలిజా ఈ ఉత్సవాలను ప్రారంభించారు. అలాగే అన్నదాన కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యంత వైభవంగా జరుగుతున్న మద్ది ఆంజనేయస్వామి ఆలయ కార్తీక మాసోత్సవాల్లో ప్రజలందరూ సంతోషంగా పాల్గొనాలని కోరారు. ఆలయానికి వచ్చే యాత్రికులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, అవాంతరాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ సిబ్బందికి, ప్రభుత్వ శాఖ అధికారులకు ఎంఎల్‌ఎ సూచించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు, తాగునీరు, ప్రాథమిక వైద్యం, భోజన వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి ఎ.కొండలరావు, గుర్వాయిగూడెం గ్రామ సర్పంచి గుబ్బల సత్యవేణి, మద్ది ఆలయ ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మన్ సరిత విజయభాస్కర్ రెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జీ, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

వాసుదేవ్ ఆచార్య మృతి తీరనిలోటు

ఏలూరు: భారత కార్మిక ఉద్యమనేత వాసుదేవ్ ఆచార్య మృతి తీరని లోటని సిఐటియు ఏలూరు పట్టణ పూర్వపు కార్యదర్శి పి.ఆదిశేషు ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంత పోరాటం చేశారన్నారు. సంఘటిత, అసంఘ టితరం గాల్లోని కార్మి కుల సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని ఆదిశేషు పేర్కొన్నారు కార్మిక కర్షక ఐక్యత కోసం శ్రమించిన నేత వాసుదేవ్ అని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం పనిచేయడమే వారికిచ్చే నిజమైన నివాళి అని అన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని వినతి

ఏలూరు అర్బన్:ఏలూరు నగరపాలక సంస్థలో విలీనమైన ఏడు గ్రామపంచాయతీలకు చెందిన అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు బకాయిపడిన గతేడాది జూన్ నెల వేతనాలు చెల్లించాలని ఎఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, సిబ్బంది ధర్నా చేసి వినతిపత్రాన్ని కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణకు సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు కార్పోరేషన్‌లో ఏడు పంచాయతీలు విలీనమై 18 మాసాలు కావస్తున్నా 2022 జూన్ నెల జీతం ఇప్పటికీ చెల్లించలేదన్నారు. అలాగే నగరపాలక సంస్థలో అర్హత కలిగిన ఉద్యోగ సిబ్బందికి ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, ఎఐటియుసి జిల్లా నాయకులు కడుపు కన్నయ్య పాల్గొన్నారు.

కొల్లేరు కాంటూరు పరిధి పెంచితే ఉపాధికి దెబ్బ



మాట్లాడుతున్న తహశీల్దారు ఎవి.రమణరావు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రస్తుత కొల్లేరు అభయారణ్యం పరిధి ఐదో కాంటూరు కన్నా పెంచితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గి నిరుద్యోగం పెరుగుతుందని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కొల్లేరు అభయారణ్య ప్రతిపాదిత సున్నిత పర్యావరణ అవగాహన సమావేశంలో పలువురు రైతులు, ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎన్నికల హామీలో కాంటూరు మూడుకు కొల్లేరు పరిధిని తగ్గిస్తామని హామీ ఇచ్చారని దాన్ని అమలు చేయకపోగా కాంటూరు ఐదు దాటి పరిధి పెంచితే ఎంతో మంది రైతులు, వ్యవయసాయ కూలీలు వలసలు వెళ్లిపోయే ప్రమాదం ఉందని ఆయా ప్రాంతాల వివిధ సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను తెలిపారు. కైకరం పంచాయతీ పరిధి రామన్నగూడెం కాంటూరు ఐదు పరిధిలో ఉండగా తాజాగా ప్రభుత్వం ఈ పరిధిని పెంచితే రామన్నగూడెం మొత్తం కొల్లేరు అభయారణ్యం పరిధికి వచ్చి వ్యవసాయం, చేపల చెరువులన్నీ నాశనమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లాపురం గ్రామానికి కొల్లేరు అభయారణ్యం రేడియేషన్ పరిధిలోకి వస్తుండడంతో ఆ గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. కొల్లేరు అభయారణ్యం ప్రతిపాదిత సున్నిత పర్యావరణ అంశంపై తహశీల్దారు ఎవి.రమణరావు వివరించారు. ఏమైనా అభ్యంతరాలు, ప్రతిపాదనలుంటే లిఖిత పూర్వకంగా ఇస్తే వాటిని కమిటీ ఛైర్మన్‌కు, కలెక్టర్‌కు పంపుతామన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఎన్.ప్రేమాన్విత, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎన్.పాపారత్నం, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, డిటి బి.దుర్గాప్రసాద్, వైసిపి జిల్లా కార్యదర్శి పుప్పాల గోపీ, ఎంపిటిసి పి.వెంకన్న పాల్గొన్నారు.

భగత్ సింగ్ కాలనీ ఇళ్లకు పన్నులు ఇవ్వాలి

జీలుగుమిల్లి:స్థానిక భగత్‌సింగ్ కాలనీలో 2018లో సిపిఎం పోరాట ఫలితంగా ఇళ్లు నిర్మించుకు నివాసం ఉంటున్న పేదలకు ఇంటి పన్ను కేటాయించాలని కాలనీవాసులు మంగళవారం పంచాయతీ కార్యదర్శి అశోక్‌కు మంగళవారం వినతిని అందించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు నెలటూరి అప్పారావు మాట్లాడుతూ ఎంతో కాలంగా కాలనీ గృహాల్లో నివసిస్తున్నారని తెలిపారు. మొత్తం 40 గృహాల వరకూ ఉన్నాయని వాటికి ఇంటి పన్ను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కార్యదర్శి స్పందిస్తూ త్వరలోనే పాలకవర్గం కమిటీ తీర్మానం తీర్మానం తీసుకుని ఇంటి పన్నులు ఇచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంతోష్, రామకృష్ణ, విజయ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రజాశక్తి బాలల దినోత్సవ సంచికల పంపిణీ



ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బాలల దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి ప్రచురించిన బాలల దినోత్సవ ప్రత్యేక సంచికను మండలంలోని ఇప్పలపాడు ఏకలవ్య మోడల్స్ స్కూల్ విద్యార్థులకు వంద ప్రతులను అందించి చదివించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం మండలం కార్యదర్శి తెల్లం రామకృష్ణ, సిఐటియు నాయకులు మొడియం నాగమణి, స్కూల్ ప్రిన్సిపల్ అమృతకుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సరైన నిర్ణయాలు, లక్ష్యం నిర్దేశించుకోవడం ద్వారా దేనినైనా సాధించవచ్చని, మంచి ఉద్యోగాలను పొందొచ్చన్నారు. ప్రజాశక్తి పత్రిక విద్యార్థులకు ఉపయోగపడే ఇలాంటి సంచికను అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సహకార బ్యాంక్‌లో 'స్పెషల్ డిపాజిట్ స్కీమ్'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ ఏలూరు, కొయ్యలగూడెం బ్రాంచ్‌లో స్పెషల్ డిపాజిట్ స్కీం ప్రారంభమైనట్లు బ్యాంక్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్కీమ్ దసరా, దీపావళి సందర్భంగా ప్రారంభించామన్నారు. 444 రోజులు 8 శాతం వడ్డీతో ఇస్తున్నట్లు, ఈ స్కీం బుధవారంతో ముగుస్తుందని తెలిపారు. ఈ స్కీమ్‌లో రూ.2 లక్షలు, ఆ పైబడి డిపాజిట్ చేసినవారికి ఎటువంటి సెక్యూరిటీ లేకుండా రుణ సదుపాయం కలదని, గ్రాముకు రూ.4,200 కేవలం 70.80 పైసలకు గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు ఇస్తారని తెలిపారు.

నేడు టిడిఎస్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



వ్యాపారులు, వర్తక సంస్థల ప్రతినిధులు టిడిఎస్‌పై అవగాహన పొందాలని చాంబర్స్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వందనపు వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీ బుధవారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్లో వ్యాపారులకు టిడిఎస్‌పై అవగాహన సదస్సు జరుగుతుందన్నారు. ఏలూరు ఆదాయ పన్ను శాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు ఈ సదస్సుకు హాజరై టిడిఎస్‌పై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సదస్సుకు వ్యాపారులు, వర్తక సంస్థల ప్రతినిధులు హాజరై అవగాహన పొందాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

25, 26వ తేదీల్లో ఐఎడివిఎల్ వార్షిక సమావేశం

ఏలూరు : 42వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్, వెనెరియాలజిస్ట్ అండ్ లెప్రోలజిస్ట్ ఆంధ్రప్రదేశ్ శాఖ వార్షిక సమావేశం ఈనెల 25, 26వ తేదీల్లో ఏలూరు ఆశ్రమ మెడికల్ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు ఛైర్పర్సన్ డాక్టర్ డి.సుబ్బారావు తెలిపారు. ఈ సమావేశ వివరాలను 17వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఐఎంఎ హాల్, పవర్ పేట, ఏలూరులో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో తెలియజేస్తామని మంగళవారం పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. మీడియా మిత్రులందరూ హాజరు కావల్సిందిగా కోరారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి సాయం

ముదినేపల్లి : అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి టిడిపి యువనేత కొడాలి వినోద్ మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. ముదినేపల్లి శివారు అన్నవరం గ్రామానికి చెందిన ఈడే నాంచారమ్మ ఇంటికి ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న కొడాలి వినోద్ పార్టీ శ్రేణులతో కలిసి అన్నవరం వెళ్లి అగ్నిబాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తనవంతు సాయంగా రూ.30 వేలు అందజేశారు. అలాగే ప్రముఖ వైద్యులు డాక్టర్ మనోజ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు సాయం అందజేశారు.

20 వరకు బాలల హక్కుల వారోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ఏలూరులోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకూ ఉపన్యాస, చిత్రలేఖనం, వ్యాసరచన, పాటలు, నాటిక ప్రదర్శన వంటి పోటీలను నిర్వహిస్తున్నామని నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ బి.నెహేమియ తెలిపారు. మంగళవారం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక అశోక్‌నగర్‌లోని కెపిడిటి ఉన్నత పాఠశాలలో బాలలకు మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక సమస్యలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నహేమియ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి నవసమాజ నిర్మాతలన్నారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిది అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ డి.రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా విక్రేతపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

నాటుసారా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మర్రిగూడెం పంచాయతీలోని తెలంగాణా సరిహద్దు లంకాలపల్లి చెక్‌పోస్టు నుంచి తెలంగాణాకు అక్రమంగా నాటుసారా తరలిస్తున్నారనే సమాచారంతో తన సిబ్బందితో దాడి చేసి రెండు లీటర్ల నాటుసార స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మారు జాతి కలప పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో కామయ్యపాలెం సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్న మారుజాతి కలపను స్వాధీనం చేసుకున్నట్లు అటవీశాఖ రేంజ్ అధికారిణి శ్రీవాణి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం తెల్లవారు జామున అటవీ శాఖ సిబ్బంది, రాజమండ్రి నుంచి వచ్చిన ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో అటవీ ప్రాంతంలో తనిఖీలు చేస్తుండగా అడవిలో నుంచి అక్రమంగా మారుజాతి కలపను నరికి 5 ట్రాక్టర్లలో లోడ్ చేసుకొని పొగాకు బ్యారన్‌లకు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. కలప ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకుని జంగారెడ్డి గూడెంలోని అటవీ శాఖ రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో అటవీ శాఖ సిబ్బంది దినేష్, మారేశ్, రహమత్, రాఘవులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తెలంగాణా నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరావు తెలిపారు. మంగళవారం జీలుగుమిల్లి మండలంలోని కామాయ్యా పాలెం చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా తెలంగాణా రాష్ట్రం నుంచి జి.రాజా తన వద్ద ఉన్న సంచిలో 3 మద్యం బాటిళ్లతో నడుచుకుంటూ వస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మద్యాన్ని సీజ్ చేసి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు

ప్రజాశక్తి - చింతలపూడి

కారులో గంజాయిని తరలిస్తుండగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ కృష్ణ ధనరాజు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి ఎస్ఇబి ఇన్స్పెక్టర్ సాయి స్వరూప్, ఎస్ఐలు అల్లురయ్య, వై.దుర్గ ప్రసాద్ వారి సిబ్బందితో కలిసి లింగగూడెం చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా బ్రెజ్జా కారులో 8.5 కిలోల గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నాట్లు వారు తెలిపారు. నిందితులు దత్తి చందు, పప్పల సురేష్, కొలుసు సాయి తేజను అరెస్టు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.85 వేల ఉంటుందని, తదుపరి విచారణ కోసం నిందితుల నుంచి 3 మొబైల్ ఫోన్‌లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఇన్స్పెక్టర్ కృష్ణ ధన రాజు తెలియజేశారు.

'విద్యార్థులకు పుస్తక పఠనం ఎంతో అవసరం'

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులకు పుస్తక పఠనం ఎంతో అవసరమని చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్ ఎన్.రాంబాబు, వైసిపి పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు తెలిపారు. పట్టణంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా గ్రంథాలయ ఛైర్మన్ మిర్యాల దిలిఫ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతలపూడి గ్రంథాలయంలో ప్రతిజ్ఞ చేసి, అనంతరం నెహ్రూ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ దుర్గారావు, మండల యువజన విభాగం అధ్యక్షులు కృష్ణ, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చాట్రాయి : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం చాట్రాయి గ్రంథాలయ శాఖలో ప్రారంభించారు. ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి లైబ్రేరియన్ మణికంఠ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయ పుస్తక ప్రాముఖ్యతను, నెహ్రూ జీవిత చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ మాస్టర్ చంటిబాబు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని పంచాయతీ సర్పంచి మోదుగు సునంద తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజన్ యుపి స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏలూరు : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవ కార్యక్రమం ఏలూరు గ్రంథాలయంలో రాము సూర్యరావు ఆర్ఎస్ఆర్ మాస్టారు చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చెన్నై వెంకట్రామయ్య, అభివృద్ధి కమిటీ సభ్యులు జిల్లెల్లమూడి వరప్రసాద్ అడ్వకేట్, ఇన్నర్ వీల్ క్లబ్ సెక్రటరీ, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యురాలు గుడిమెట్ల అచ్యుత, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం సెక్రటరీ గుడిపాటి నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు, ఎమ్.శోభ పాల్గొన్నారు.

భీమడోలు : గ్రంథాలయాల సేవలను వినియోగించుకోవాలని భీమడోలు జెడ్‌పిటిసి సభ్యురాలు తుమ్మగుంట భవానీ రంగా కోరారు. మండలంలోని మూడు శాఖా గ్రంథాలయాల్లో వారం రోజులపాటు కొనసాగే గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. భీమడోలు, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో గ్రంథపాలకులు కె.శ్రీనివాసరావు, జి.నాగమణి, గ్రంథాలయాల అభివృద్ధి కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొన్నారు. గుండుగొలను శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక సత్యసాయి సమితి సభ్యులు గ్రంథాలయానికి అవసరమైన ఫర్నిచర్ నిమిత్తం రూ.5 వేల విరాళాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జి.మురళితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.



ఆగిరిపల్లిలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న విక్టర్‌బాబు

కొయ్యలగూడెం : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం మొదలయ్యాయి. లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో పెద్దలు జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభించారు. ఈనెల 19వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నారు.

ఉంగుటూరు : చేబ్రోలు బాలసరస్వతి మండల శాఖ గ్రంథాలయంలో మంగళవారం వారోత్సవాలను సర్పంచి రాంథే లక్ష్మీ సునీత ప్రారంభించారు. తొలుత పండిట్ నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రంథాలయాల ఆవశ్యకతను పలువురు వక్తలు వివరించారు. ఎంపిటిసి-1 సభ్యురాలు మనసాల నాగమణి, విశ్రాంత ఉపాధ్యాయుడు యు.వెంకటేశ్వరరావు, కె.రామకృష్ణ, లైబ్రేరియన్ కొండ్రెడ్డి సీతారామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని, వాటిని సద్వినియోగపర్చుకోవాలని ఆగిరిపల్లి గ్రామ ప్రముఖులు చవటపల్లి విక్టర్‌బాబు తెలిపారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆగిరిపల్లి శాఖ గ్రంథాలయంలో జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గోళ్ల ఇస్సాక్, టిడిపి నాయకులు పామర్తి నరశింహారావు, ఎంఇఒ-2 కె.ఆనంద్‌కుమార్, పిహెచ్‌సి వైద్యాధికారి-2, ఎస్‌కె.టీనా, గ్రంథాలయాధికారి డి.నాగేశ్వరరావు, పాఠకులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక శాఖ గ్రంథాలయంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ప్రారంభ వేడుకలు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అధ్యక్షతన శాఖ గ్రంథాలయ అధికారి పి.దుర్గారావు నిర్వహణలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, పట్టణ వైసిపి అధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

కలిదిండి : గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని ఎంపిటిసిలు నీలి సుమన్, షఫయతుల్లా అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారోత్సవాల్లో విద్యార్థులు, పాఠకులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రంథాలయాల ఆవశ్యకతను చాటాలని శాఖ గ్రంథాలయాధికారి జె.రమేష్ కోరారు. సాహితీ మిత్రుల అధ్యక్షులు ఎల్ఆర్ పోలిశెట్టి, జి.నరసయ్య, పురుషోత్తం పాల్గొన్నారు.

మండలంలోని కోరుకొల్లు శాఖ గ్రంథాలయంలో సర్పంచి బట్టు లీలా కనకదుర్గ మహేష్ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. నెహ్రూ జయంతి సందర్భంగా ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలలోని విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు. నాయకులు నున్న సుబ్రమణ్యం, నూకల అరుణ కుమారి శ్రీనివాస్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లి : గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని వాటి ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని సర్పంచి మెండ జాన్సీ స్పష్టం చేశారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ నిర్వహకురాలు షేక్ పర్వీన్, మండవల్లి హైస్కూల్ లైబ్రరీ అసిస్టెంట్ నాగమల్లేశ్వరరావు, మెండ సురేష్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : ప్రతిఒక్కరూ గ్రంథాలయాలను వినియోగించుకుని ఉన్నతులుగా ఎదగాలని ముదినేపల్లి గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ తెలిపారు. ముదినేపల్లి శాఖ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను కైకమ్మ మంగళవారం ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నిమ్మ గడ్డ బిక్షాలు, ఉపాధ్యాయులు గిరిధర్, లక్ష్మీ కుమారి, ఎన్‌వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ముసునూరు : ప్రతీ విద్యార్థి పుస్తక పఠనం చేసినట్లయితే చదువులో ముందంజులో వుంటారని సర్పంచి కోండేటి విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ముసునూరు, గోపవరం, గుడిపాడు, చెక్కపల్లి గ్రామాల్లోని గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవ ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు పిన్నిబోయిన వెంకటేశ్వరరావు, తుల్లిమెల్లి నాగరాజు, టి.లక్ష్మణ్‌బాబు, గ్రంథాలయ అధికారిణి టి.రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట దిగుబడి క్షేత్రస్థాయిలో నిర్వహించాలి

ముసునూరు : వ్యవసాయ రంగంలో పంటల దిగుబడి క్షేత్రస్థాయిలో నిర్వహిస్తే రేవెన్యూ గ్రామ యూనిట్ దిగుబడి శాతం ప్రభుత్వానికి నివేదిక పంపవచ్చునని మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ తెలిపారు. మంగళవారం మండలంలోని చెక్కపల్లి, గోపవరం గ్రామాల్లో వరి పంటలోని దిగుబడి శాతం తెలుసుకోవడం జరుగుతుందన్నారు.గతంలో మండల యూనిట్‌గా తీసుకుని ప్రభుత్వానికి నివేదిక పంపినట్లైతే మండలంలో కొన్ని గ్రామాల్లో అధిక దిగుబడులు రావడం, మరికొన్ని గ్రామాల్లో తక్కువ దిగుబడులు రావడంతో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయనే ఉద్దేశంతో గణాంక శాస్త్రవేత్తలు పైన తెలిపిన విధంగా గ్రామం యూనిట్‌గా చేస్తున్నట్లు తెలియజేశారు.

ఎల్ఎన్‌డి పేటలో 'వై ఎపి నీడ్స్ జగన్'

పోలవరం : మండలంలోని ఎల్ఎన్‌డి పేటలో పోలవరం వైసిపి మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ కృష్ణ మాట్లాడుతూ వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.20 కోట్ల 72 లక్షలు ఏవిధంగా అందాయో వివరించారు. అనంతరం వైసిపి జెండా ఆవిష్కరించి, పల్లెకి పోదాం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సింగరాజు, సొసైటీ ప్రెసిడెంట్ బండారు అప్పారావు, జిల్లా ప్రెసిడెంట్ దేవిశెట్టి రమేష్, ఇల్లా కళ్యాణ్, దూళి బాపిరాజు, మండల కార్యదర్శి ఈర్నాల బాపిరాజు, జెఎసి కన్వీనర్ మాదేపల్లి సాయికృష్ణ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు బస్‌పాస్‌ల పంపిణీ

జంగారెడ్డిగూడెం : స్థానిక రోమన్ క్యాథలిక్ మిషన్ సోషల్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో ఆర్‌సిఎం చర్చి ఆవరణలో విభిన్న ప్రతిభావంతులకు మంగళవారం ఉచితంగా బస్సుపాస్‌లు అందజేశారు. ఏలూరు మేత్రాసనం సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఫాదర్ ఇమ్మానుయేలు మాట్లాడుతూ నాలుగు జిల్లాల పరిధిలో సోషల్ సర్వీస్ సెంటర్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మంగళవారం నిర్వహించిన ఈ ప్రత్యేక శిబిరంలో 250 మంది విభిన్న ప్రతిభావంతులకు బస్సు పాసులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఆర్‌టిసి డిపో మేనేజర్ గంగాధర్ రావు, స్థానిక ఆర్‌సియం చర్చి విచారణ గురువులు ఫాదర్ కె.కళ్యాణ్ కుమార్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై పోరాడాలి

జంగారెడ్డిగూడెం : ఐక్యంగా పోరాడితేనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అవుతాయని విద్యావేత్త డా.అలుగు ఆనంద శేఖర్ అన్నారు. స్థానిక ప్రియదర్శిని కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డిసెంబర్ 3న ఏలూరులో జరిగే జిల్లా మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెడరేషన్ చొరవతో అన్ని జర్నలిస్ట్ సంఘాలని ఏకం చేసి అందరికీ ఆమోద యోగ్యమైన పరిష్కారం కనుగొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కె.కిరణ్, కలపాల శ్రీనివాస్, కలపాల చందు, అద్దేటి వెంకటేశ్వరరావు, అచ్యుత సూర్య, కడలి గాంధీ, కిషోర్ పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

చింతలపూడి : పంటల బీమా పథకం నిబంధనల ప్రకారం పంట నష్టపరిహారం లభించని పరిస్థితుల్లో ప్రభుత్వమే బాధ్యత వహించి, పంట నష్టపోయిన రైతుకు సర్వే నెంబర్ విస్తీర్ణం మేరకు పంట నష్టపరిహారం ఇవ్వాలని సిపిఐ, ఎపి రైతు సంఘం మండల కమిటీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశాయి. మంగళవారం చింతలపూడి తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహశీల్దార్ షకీలాకి వినతిని సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, ఎపి రైతు సంఘం కార్యదర్శి దంతా కృష్ణ మాట్లాడుతూ పంటల బీమా పథకంతో సంబంధం లేకుండా, సర్వే నంబర్ ఆధారంగా పంట నష్టపరిహారం ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలన్నారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి సర్వేనెంబర్ ఆధారంగా నష్టపరిహారం ఇవ్వాలని, పండిన ధాన్యాన్ని ఎటువంటి నిబంధనలు లేకుండా ఆర్‌బికేల ద్వారా కొనుగోలు చేయాలన్నారు. మండలానికి సాగునీరు అందాలంటే తక్షణమే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి, మండలంలో ఉన్న అన్ని చెరువులకు అనుసంధానం చేసి సాగునీరు, తాగునీరు సరఫరా చేయాలని వీరు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి తోర్లపాటి బాబు, పట్టణ కార్యదర్శి ఎస్‌కె.జానీ, ఎపి రైతు సంఘం నాయకులు తక్కెళ్లపాటి ప్రసాద్, రావెళ్ల హనుమంతరావు, రైతులు గట్టు వెంకటేశ్వరరావు, గట్టు వెంకన్న, బోడా నాగరాజు, సంకు శ్రీనివాసరావు, వినుకొండ సీతారామయ్య పాల్గొన్నారు.

పట్టిసీమ వీరేశ్వర స్వామిని దర్శించుకున్న ఎంపిపి సుంకర వెంకట రెడ్డి

పోలవరం : మండలంలోని పాత పట్టిసీమ శ్రీభద్రకాళి సమేత వీరేశ్వర స్వామిని జిల్లా ఎంపిపి సంఘాల అధ్యక్షులు, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి దర్శించుకున్నారు. అనంతరం కార్తీకమాసం సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతీరోజు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఒ ఎంఎస్.సంగమేశ్వర శర్మ, ఆలయ అర్చకులు, స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

బాసవరపాడులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ముసునూరు : టిడిపి అధికారంలోకి వస్తే రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని నూజివీడు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి ముద్రబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం లోపూడి పంచాయతీ శివారు బాసవరపాడు గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని టిడిపి మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గద్దె రఘుబాబు, కొల్లి గంగారామ్, కందుల పిచ్చయ్య పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన

ఏలూరు : ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విజయ మల్టీపుల్ స్పెషలిటీ హాస్పిటల్, ఆర్ఆర్ పేటలోని రాఘవచారి వీధిలో ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా మధుమేహంపై అవగాహన, పరీక్షా శిబిరాన్ని ప్రథమ వైస్ గవర్నర్ లయన్స్ కాకరాల వేణు బాబు ప్రారంభించారు. ఈ అవగాహన కార్యక్రమానికి క్లబ్ ఉపాధ్యక్షులు మారగాని శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. లయన్స్ డాక్టర్ బి.ఆనంద్ కుమార్ షుగర్ వైద్య నిపుణులు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. సుమారు 159 మంది వైద్య సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో రీజియన్ ఛైర్‌పర్సన్, లయన్స్ ఎ.శేషు కుమార్, మద్దుకూరి శ్రీహరి పాల్గొన్నారు.

'జగనన్న చేదోడు' ద్వారా రూ.10 వేలు

జంగారెడ్డిగూడెం : వైసిపి ప్రభుత్వంలో నాయి బ్రాహ్మణులకు జగనన్న చేదోడు పథకం ద్వారా రూ.10 వేలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్నారని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఉప్పిడి వీరాంజనేయులు తెలిపారు. మంగళవారం స్థానిక నాయి బ్రాహ్మణ సంఘం సాధారణ సమావేశం పట్టణ అధ్యక్షులు మల్లవరపు నాగపోసు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైసిపి పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్యలు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు చిప్పాడ నరసింహారావు, సెక్రెటరీ కొప్పుల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

ఏలూరు : బాల వికాస్ భారతి, మానవత సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు వైఎస్ఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఉదయం 'బాలల దినోత్సవం' బాలవికాస్ భారతీయ అధ్యక్షులు, న్యాయవాది కట్టా సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇజ్రాయిల్ – పాలస్తీన మధ్య యుద్ధాన్ని ఆపాలని, అక్కడ బాలబాలికలను యుద్ధం నుంచి రక్షించాలని తెలిపారు. యుద్ధం కారణంగా ఎంతోమంది బాలబాలికలు, పెద్దవాళ్లు, సైనికులు మరణించడం చాలా బాధాకరమని, పిల్లల భవిష్యత్తు తల్లిదండ్రులను కోల్పోయి అగమ్యగోచరంగా తయారవుతుందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏలూరు మానవత సంస్థ కార్యదర్శి పోడూరి కనకదుర్గ మాట్లాడుతూ అమ్మ ప్రాముఖ్యతను పాట రూపంగా పాడి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ రీజినల్ ఛైర్మన్ పోలవరపు దేవరత్నాకర్, వల్లూరి సాయి సుధా, మానవత సంస్థ జిల్లా డైరెక్టర్ దేవినేని భాస్కర రావు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని గుటాల గ్రామం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెవి.రాఘవన్ ఆధ్వర్యంలో భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా మంగళవారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బొరుసు బాలాజీ, చంద్రశేఖర్, కొంజర్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

భీమడోలు : మండలంలోని వివిధ పాఠశాలల్లో జాతీయ బాలల దినోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జెఎంఎం పురం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం నిర్మలాకుమారి, ఉపాధ్యాయులు ఎం.సుధాకర్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇదేవిధంగా అన్నేవారి గూడెం ఎంపీపీ ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచి నీలం శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు పి.శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జాతీయ బాలల దినోత్సవం పురస్కరించుకొని గత వారం రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీలలో విజేతలకు బహుమతి ప్రధానం చేశారు.

ఆగిరిపల్లి : బాలల దినోత్సవ వేడుకలను ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఆగిరిపల్లి జెడ్‌పిహెచ్ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు పి.పుష్పలత జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో వెయిట్ లిఫ్టింగ్ క్రీడా పరికరాలను కొనుగోలు చేయుటకు పెద్ది చంద్రశేఖర్, లలితా కుమారి దంపతులు రూ.20 వేల నగదును వితరణగా అందజేశారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయడానికి జూలూరు బాపనయ్య గుప్త రూ.5 వేలు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఎంసి ఛైర్మన్ పి.రాంబాబు పాల్గొన్నారు.

చింతలపూడి : క్రమశిక్షణ, ఏకాగ్రతతో చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని రామకృష్ణ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు డేవిడ్ రాజు, ఉమర్ ఫరూక్, కుమారి, ఉలవలపూడి మౌనిక, సోషల్ వర్కర్ అక్బర్ అలీ, స్కూల్ హెడ్‌మాస్టర్ డి.రామకృష్ణ పాల్గొన్నారు.



భీమడోలులోని అన్నేవారి గూడెం ఎంపిపి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో..

చాట్రాయి : నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా జరుపు కోవడం వెనుక కారణం విద్యార్థుల మానసిక వికాసానికి, ఉల్లాసానికి ఆటల్లో వారు ప్రతిభను గుర్తించటానికేనని చిత్తపూరు సర్పంచి తిరివీధి రమేష్ తెలిపారు. మండలంలోని చిత్తపూరు పడమట దళిత వాడలో మండల ప్రజా పరిషత్ పాఠశాలలో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎంపిటిసి ఎల్లంకి సుజాత, విద్యా కమిటీ ఛైర్మన్ పత్తిపాటి రజిని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : జవహర్‌లాల్ నెహ్రూ 135వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ దండుబోయిన చంద్రశేఖర్, బ్లాక్ టూ ప్రెసిడెంట్ లంక రామ్మోహన్, ఏలూరు నగర కాంగ్రెస్ ఎస్‌సి సెల్ అధ్యక్షులు నలగట్ల అనీల్ మాణిక్యం, ఏలూరు సిటీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సాదే బాబూ ప్రసాద్, సేవాదళ్ సుబ్బారావు, ఏలూరు కిసాన్ సెల్ ప్రెసిడెంట్ కొమ్మన సాంబశివరావు, కందికుప్ప వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : హిందూ యువజన సంఘం, నెహ్రూ యువ కేంద్ర, వారి సంయుక్త ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు మంగళవారం ఏలూరు వైఎంహెచ్‌ఎ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏలూరు మాజీ ఎంఎల్‌ఎ అంబికా కృష్ణ, ప్రముఖ సినీ పంపిణీ దారులు ఉషా గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ వివి.బాలకృష్ణారావు, హిందూ యువజన సంఘం మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కెవి.సత్యనారాయణ, కోశాధికారి కానాల బాల వెంకట రమేష్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ 7వ అదనపు జిల్లా జడ్జి
ప॥గో॥జిల్లా :: ఏలూరు
ఐ.ఎ.నెం. 191/2023
ఓ.యస్.నెం. 26/2010

Between:
తంగెళ్ళ వెంకటరాంబాబు మరియొక్కరు
...పిటీషనర్లు /వాదులు
మరియు
ఉప్పాల కళ్యాణి వగైరాలు ...రెస్పాండెంట్లు
పిటీషనర్లు /వాదులు దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల పిటీషనులో రెస్పాండెంటు 16 అయిన 16) రాయంకుల శ్రీహరి, తండ్రి: లేటు సోభనాద్రి, డో.నెం. 3-354, ధర్మాజిగూడెం, లింగపాలెం మండలం, ఏలూరు జిల్లా వారికి పై నెంబరు గల పిటీషనులో **ది.16-11-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు** పై కోర్టులో స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు పిటీషను ఏకపక్షమున తీర్మానం చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఆవుల జగన్మోహనరావు
ఏలూరు, **పుప్పాల రామకృష్ణ**
14-11-23. అడ్వకేట్స్, ఏలూరు

In the Court of Princial Junior Civil Judge, Tanuku
O.S. No. 336/2020

Between:
Plaintiff: Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru
AND
Defendants:
Katta Priyanka and another
వాది తరుపున చేయించిన ప్రకటన
ప్రతివాదులు:
1. కట్టా ప్రియాంక, W/o. వెంకటరత్నం, హిందువు, స్త్రీ, 34 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2. వేముల అశ్వనికుమార్, S/o. భాస్కరరావు, హిందువు, పురుషుడు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులు అయిన మీకు కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారు ఆదేశముల ప్రకారము ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, ఈ ప్రకటన తేది నుండి 30 రోజులు లోగ మీరు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై పై నెంబరు దావాలో మీ తాలూకు ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను, లేనిచో మీ పై పరోక్షంగా చర్యలు తీసుకొనబడునని మీకు తెలియజేయడమైనది.

D.S.V.KRISHNAJI
Advocate, Tanuku-534211

వేలం ప్రకటన
మహారాజశ్రీ అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి ప॥గో॥జిల్లా ఏలూరు వారి కోర్టులో
ఇ.పి.నెం. 322/2011
ఇన్ ఓ.ఎస్.నెం. 348/2007

బిట్వీన్:
శ్రీ గోళ్ళ యలమందల రావు
...డి. హెచ్. ఆర్ /వాది
అండ్
శ్రీ లంకా శ్రీనివాసరావు
శ్రీమతి లంకా రాజేశ్వరి
...జె. డి. ఆర్స్ /ప్రతివాదులు

పై నెంబరు గ్రంథములో డిక్రీ బాకీ వసూలు కొరకు జె.డి.ఆర్స్ /ప్రతివాదులు యొక్క సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములో గల ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని **ది.30-11-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయబడును. యావన్మంది వేలం పాటలో పాల్గొని పాడుకో వచ్చును. కోర్టు వారి షరతులు వర్తించును.

షెడ్యూలు ఆస్తి వివరములు: పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు సబ్ రిజిస్ట్రారు ఇలాకా, ఏలూరు నగరం, టి.ఎస్.నెం. 1572, పాత అసెస్మెంట్ నెం. 3294 దాఖలా చ॥గ॥లు 130 అందులో గల పెంకుటిల్లు నెం. 3బి-3-8 కు హద్దులు: **దక్షిణం:** శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి తాలూకు ఆస్తి. **తూర్పు:** డి.మధుసూధనారావు ఆస్తి. **పడమర:** మునిసిపల్ బజార్. **ఉత్తరం:** ఆర్.లక్ష్మణరావు ఆస్తి.

ఈ హద్దుల మధ్య సుమారు 130 చ॥గ॥ల ఇంటి స్థలం అందలి పెంకుటిల్లుతో సహా వేలం వేయుదురు.

డి. హెచ్.ఆర్ విలువ : రూ.2,00,000/-
అమీనా విలువ : రూ.7,50,000/-

ఈ. శ్రీనివాసబాబు
ఏలూరు, అడ్వకేట్, ఏలూరు.
15-11-23. ఫోన్: 08812-239498

ప్రకటన

నా క్లయింటు యన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ, అజిత్ సింగ్‌నగర్, లూనా సెంటర్, రైతుబజార్ దగ్గర, డోరు నెం.42-6-8 రు కాపురస్తులు తమ్మిన సన్నీ బాబు గారి కుమారుడు తమ్మిన సూర్య ప్రకాష్ గారు సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది, ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, అడవినెక్క గ్రామ ఆర్.యస్.నెం.519/1 రు దాఖలా య.0.89 1/4 ట్లు స్థిరాస్తిని ది.10-07-2023వ తేదీన యన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ, దుర్గాపురం, 4వ లైన్, డోరు నెం.24-25-1రు కాపురస్తులు 1) దొడ్డపనేని వెంకటేశ్వరరావు గారి కుమారుడు దొడ్డపనేని నవీన్‌కుమార్, మరియు 2) కోటపాటి గోవిందరెడ్డి గారి కుమారుడు కోటపాటి శ్రీనివాసరెడ్డి, 3) మట్లా అంకయ్య గారి కుమారుడు మట్లా రవీంద్ర, 4) మట్లా కొండలరావుగారి కుమారుడు మట్లా యశ్వంత్‌కుమార్, 5)జాజుల చిన కొండయ్య గారి కుమారుడు జాజుల మల్లిఖర్జునరావు గారలు, రేమాల సాయిప్రసాద్ వగైరాల వలన గన్నవరం సబ్‌రిజిస్ట్రారు వారి ఆఫీసులో విక్రయ దస్తావేజు నెం.7264/2023 రుగా క్రయం పొంది సదరు భూమిని ప్లాట్లుగా విభజించిన ఆస్తిలోని భాగమైనట్టి ప్లాటు నెం.23 రు దాఖలా చ.గ.144.1 ల ఖాళీ నివేశన స్థలమును వలన విక్రయ ఖారు పొంది, మరికొద్ది రోజులలో విక్రయ దస్తావేజును వ్రాయించు కుని రిజిష్టరు చేయించు కోబోవుచున్నారు. కావున సదరు భూమిపై ఎవరికైనా యెట్టి అభ్యంతరములు గాని, హక్కులు గాని వగైరా అన్యాక్రాంతములు జరిపిన యెడల నాకు గాని, నా క్లయింటునకు గాని ఈ ప్రకటన విడుదల అయిన తేదీ నుండి 7 రోజుల లోపు తెలియపరచవలసినదిగా కోరుచున్నాము. సదరు గడువు అనంతరం వచ్చు అభ్యంతరములు గాని, ఆక్షేపణలు గాని నా క్లయింటును బద్ధులను చేయ జాలవు.

షెడ్యూలు:-
ఏలూరు జిల్లా, గన్నవరం సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, ఆగిరిపల్లి మండలం, అడవి నెక్కలం గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన, అడవి నెక్కలం గ్రామ ఆర్.యస్.నెం.519/1 రు దాఖలా య.0.89 1/4 ట్లు స్థిరాస్తి స్థిరాస్తిలో ప్లాటు నెం.23 రు దాఖలా చ.గ.144.1 ల ఖాళీ స్థలముకు హద్దులు:
తూర్పు:అ.33.0లు వెడల్పు గల రోడ్డు అ.31.00లు
దక్షిణము:ప్లాటు నెం.24 అ.42.02లు
పడమర:దద్దనాల రంగారావు గారి భూమి అ.31.00లు
ఉత్తరము:ప్లాటు నెం.22 అ.41.10లు
యీ నాలుగు హద్దుల మధ్య చ.గ.144.1 లేక చ.మీ.120.4 ల స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమున్నూ

Torlikonda Ramakrishna, M.A.,L.L.B.
Advocate, D.No.7-135,
Venu Gopala Swamy Temple Street,
Nunna-521212,
Vijayawada Rural Mandal,
Krishna District, Cell:9849184404.